క్లుప్తంగా

చలివేంద్రాలు ప్రారంభం



పెదతాడివాడలో మజ్జిగ పంపిణీ చేస్తున్న పంచాయతీ కార్యదర్శి అప్పలనాయుడు, తదితరులు

డెంకాడ: మండలంలోని పినతాడివాడ గ్రామ సచివాలయం కూడలి వద్ద సచివాలయ సిబ్బంది శనివారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. తొలిరోజు సచివాలయ సిబ్బంది తమ సొంత నిధుల తో పాదచారులు, ప్రయా ణికులకు మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ లెంక లక్ష్మణరావు, ఎంపీటీసీ సభ్యుడు విజినిగిరి అచ్చంనాయుడు, మాజీ సర్పంచ్ పల్లె భాస్కరరావు, పంచాయతీ కార్యదర్శి తాడ్డి వెంకటరావు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు. అలాగే పెదతాడివాడ గ్రామంలో ఆ గ్రామ సచివాలయం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసి న చలివేంద్రాన్ని పంచాయతీ కార్యదర్శి అప్పలనాయుడు ప్రారంభించారు. స్థానిక నాయకులు, సచివాల య ఉద్యోగులు పాల్గొన్నారు.

సోలార్‌తో విద్యుత్ బిల్లులు ఆదా



మాట్లాడుతున్న విద్యుత్ శాఖ ఏడీ కిరణ్‌కుమార్

విజయనగరం ఫోర్ట్: ఇళ్లపై సోలార్ రూఫ్ టాప్‌ల ఏర్పాటు చేసుకోవడం ద్వారా విద్యుత్ బిల్లులను ఆదా చేసుకోవచ్చని విద్యుత్‌శాఖ ఏడీ కిరణ్ కుమార్ చెప్పారు. పట్టణంలోని ఉడా కాలనీలో ప్రజలకు పీఎం సూర్యఘర్ యోజన పథకంపై శనివారం అవగాహన కల్పించారు. సోలార్ రూఫ్ టాప్‌ల ఏర్పాటుకు ప్రభుత్వం అందించే రాయితీలు, వీటి ఏర్పాటుతో కలిగే ప్రయోజనాలను వివరించారు.

173 మందికి థైరాయిడ్ పరీక్షలు



థైరాయిడ్ పరీక్షలు చేస్తున్న వైద్యసిబ్బంది

విజయనగరం టౌన్: రోటరీ క్లబ్ ఆఫ్ విజయనగరం సెంట్రల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రోటరీ హెల్త్ సెంటర్‌లో డాక్టర్ మృత్యుంజయరావు ఆధ్వర్యంలో శనివారం 173 మందికి ఉచితంగా థైరాయిడ్ పరీక్షలు చేశారు.రోటరీ క్లబ్ చైర్మన్ సి.పి. జైన్, కార్యదర్శి ఆరిశెట్టి నాగేశ్వరరావు మాట్లాడుతూ అందరికీ ఆరోగ్యం అందుబాటులో ఉండాలన్న సంకల్పంతోనే రోటరీ హెల్త్ సెంటర్ నిర్వహిస్తున్నామన్నారు. అనుభవజ్ఞులైన వైద్యులతో రోజూ బ్లడ్ టెస్టులు, ఫిజియోథెరపీ సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ సభ్యులు జగదీష్, మారుతీ మధు శ్రీనివాస్ పాల్గొన్నారు.

తోటివారిపై ప్రేమతో మెలగుదాం



భక్తులకు అందించే ప్రసాదాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ఖలీల్‌బాబు, తదితరులు

విజయనగరం టౌన్: తోటివారిపై ప్రేమతో మెలిగడమే భగవంతుని చేరుకునే ఉత్తమ మార్గమని పవిత్ర సూఫీ మార్గ నిర్దేశకులు డాక్టర్ ఎం.డి. ఖలీలుల్లా షరీఫ్ అన్నారు. రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని దర్బార్‌లో శనివారం అన్నసమారాధన జరిపారు. కార్యక్రమంలో జీవీఎంసీ మధురవాడ జోన్ 2 కమిషనర్ కె.కనకమహాలక్ష్మి, కేజీహెచ్ రిటైర్డ్ సూపరింటెండెంట్ డాక్టర్ మైథిలి, ఖలీల్‌బాబు తనయుడు మహమ్మద్ అహమ్మద్ భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

విజయనగరం ఫోర్ట్: దాసన్నపేట విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనుందని విద్యుత్‌శాఖ ఈఈ పి.త్రినాథరావు శనివారం ప్రకటనలో తెలిపారు. సబ్ స్టేషన్‌లో బ్రేకర్ నిర్మాణ పనులు చేపట్టనున్న నేపథ్యంలో సబ్‌స్టేషన్ పరిధిలోని సింగ్‌పూర్ సిటీ, జమ్ము, నారాయణపురం, పడాలపేట, ఆనందపురం, బ్యాంక్ కాలనీ, తాడివాడ, సి.ఆర్.నగర్ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

అలసత్వం తగదు

- రెన్యూవల్ చేసుకోని ఆస్పత్రులకు నోటీసులు
- క్లినిక్‌లు, ఆస్పత్రులు, ల్యాబ్‌లకు అయిదేళ్లకోసారి రెన్యూవల్ తప్పనిసరి

విజయనగరం ఫోర్ట్:

సకాలంలో రిజిస్ట్రేషన్ రెన్యూవల్ చేసుకోని ఆస్పత్రులు,క్లినిక్‌లకు వైద్యారోగ్యశాఖ అధికారులు నోటీసులు ఇస్తున్నారు. ఇప్పటికే కొన్ని ఆస్పత్రులకు అధికారులు నోటీసులు జారీ చేశారు. జిల్లాలో ప్రైవేటు ఆస్పత్రులు, క్లినిక్‌లు, ల్యాబ్‌లు, డెంటల్ క్లినిక్‌లు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి.చాలా ఆస్పత్రులు, క్లినిక్‌లను వైద్యారోగ్యశాఖ వద్ద రిజిస్ట్రేషన్ చేయించుకోకుండానే నిర్వహిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.ఆస్పత్రులు, క్లినిక్‌లు,ల్యాబ్‌లు, ఫిజి యోథెరపీ క్లినిక్‌ల నిర్వహణకు వైద్యారోగ్యశాఖ వద్ద రిజిస్ట్రేషన్ తప్పనిసరి. ఒకసారి రిజిస్ట్రేషన్ అయిన తర్వాత అయిదేళ్లకోసారి రెన్యూవల్ చేయించుకోవాలి. అయితే కొంతమంది రెన్యూవల్ చేసుకోవడంలో అలసత్వం వహిస్తున్నారు. రెన్యూవల్ చేసుకోలేదని జిల్లాలో అన్నపూర్ణ నర్సింగ్ హోమ్, వైట్ స్మైల్ డెంటల్ క్లినిక్, నాగార్జున డెంటల్, జ్యోతి నర్సింగ్ హోమ్, కేర్, క్యూర్ డెంటల్ క్లినిక్‌ల నిర్వాహకులకు వైద్యారోగ్యశాఖ అధికారులు తాజాగా నోటీసులు ఇచ్చారు.



జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయం

జిల్లాలో ప్రైవేటు ఆస్పత్రుల వివరాలు

జిల్లాలో వైద్యారోగ్యశాఖ వద్ద 121 ప్రైవేటు ఆస్పత్రులు, నర్సింగ్ హోమ్‌లు, 101 క్లినిక్‌లు, 51 డయోగ్నోస్టిక్ సెంటర్స్, 57 డెంటల్ క్లినిక్‌లు, 11 ఫిజియోథెరపీ క్లినిక్‌లు ఉన్నాయి. ఇవన్నీ వైద్యారోగ్యశాఖ వద్ద రిజిస్ట్రేషన్ చేసుకున్నాయి.

రిజిస్ట్రేషన్ ఫీజుల వివరాలు:

క్లినిక్ అయితే ఏడాదికి రూ.250 చొప్పున అయిదేళ్లకు రూ.1,250 ఫీజు చెల్లించి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. పాలీ క్లినిక్‌లు అయిదేళ్లకు రూ.2,500, ల్యాబొరేటరీలు రూ.2,500, నర్సింగ్‌హోమ్‌లు 3,750 చెల్లించాలి. 20 పడకల ఆస్పత్రికి ఏడాదికి రూ.1,500 చొప్పున అయిదేళ్లకు రూ.7,500, 50 పడకలు దాటితే ఏడాదికి రూ.2 వేలు చొప్పున అయిదేళ్లకు రూ.10 వేలు చొప్పున చెల్లించాలి.

రెన్యూవల్ చేసుకోపోతే చర్యలు

వైద్యారోగ్యశాఖ వద్ద అనుమతి లేకుండా ఆస్పత్రులు, క్లినిక్‌లు, ల్యాబొరేటరీలు నిర్వహించకూడదు. సకాలంలో రెన్యూవల్ చేయించుకోవాలి. లేక పోతే చర్యలు తప్పవు.

– డాక్టర్ జీవనరాణి, డీఎంహెచ్‌ఓ

రెవెన్యూ పెంచే మార్గదర్శకాలు పాటించాలి



మాట్లాడుతున్న వాణిజ్య పన్నులు, సహకారశాఖ కమిషనర్ అహ్మద్‌బాబు

విజయనగరం అర్బన్: ప్రభుత్వానికి రెవెన్యూ పెంచేందుకు రూపొందించిన మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని జిల్లా ప్రత్యేక అధికారి, వాణిజ్య పన్నులు, సహకారశాఖ కమిషనర్ అహ్మద్ బాబు అన్నారు. జిల్లా పర్యటనలో భాగంగా స్థానిక కమర్షియల్ ట్యాక్స్ కార్యాలయాన్ని శనివారం ఆయ న సందర్శించారు. ఈసందర్భంగా అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వానికి రావాల్సిన రెగ్యులర్ రిటర్న్‌తోపాటు పన్నుల బకాయిలను వసూలు చేయడం, అర్హత కలిగిన నూతన రిజిస్ట్రేషన్‌లు నమోదు చేయాలని, వృత్తి పన్ను వసూళ్లను కూడా పెంచాలని నిర్దేశించా రు. సమావేశంలో స్టేట్ ట్యాక్సెస్ జాయింట్ కమిషనర్ జి.నాగార్జునరావు, డిప్యూటీ కమిషనర్ పి.బి.వల్లి, మూడు జిల్లాల సహాయ వాణిజ్య పన్నుల కమిషనర్లు పాల్గొన్నారు.

'సూర్యఘర్'పై అవగాహన



అవగాహన కల్పిస్తున్న డీఈఈ రమణ

చీపురుపల్లి: విద్యుత్ వినియోగదారులందరూ సూర్యఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని, నాణ్యమైన సౌరశక్తిని వినియోగించుకోవాలని ఏపీఈపీడీసీఎల్ డీఈఈ బి.వి.రమణ కోరారు. చీపురుపల్లి పట్టణంలోని కొత్తగవిడి వీధి కోటదుర్గమ్మ ఆలయం వద్ద సూర్యఘర్ పథకంపై శనివారం అవగాహన కల్పించారు. మేడలపై సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటుతో సోలార్ విద్యుత్ సదుపాయం పొందవచ్చన్నారు. సోలార్ విద్యుత్ యూనిట్లు కావాలనుకునే వినియోగదారులు నేరుగా విద్యుత్‌శాఖ కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈ సూర్య ప్రభాకర్ పాల్గొన్నారు.

స్వచ్ఛాంధ్ర అందరి బాధ్యత

వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటిస్తూ స్వచ్ఛాంధ్ర సాధనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని అధికారులు, ప్రజాప్రతినిధులు కోరారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు 'స్వచ్ఛాంధ్ర – స్వర్ణాంధ్ర' కార్యక్రమాన్ని జిల్లా కేంద్రం విజయనగరంతో పాటు నెల్లిమర్ల నియోజకవర్గాల్లో శనివారం నిర్వహించారు. విద్యాలయాలు, ప్రభుత్వ కార్యాలయాలు, గ్రామాల్లో పరిసరాలను పరిశుభ్రం చేశారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటిస్తామని, పాలిథిన్ ఉత్పత్తులను నిషేధిస్తామని ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు, విద్యార్థులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



విజయనగరం ఫోర్ట్: జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయం వద్ద సిబ్బందితో ప్రతిజ్ఞ చేయిస్తున్న డీఎంహెచ్‌ఓ జీవనరాణి



విజయనగరం గంటస్తంభం: పులాబాగ్ సమీపంలోని జిల్లా అటవీశాఖ కార్యాలయంలో పరిసరాలు శుభ్రం చేస్తున్న ఫారెస్టు అధికారి కొండలరావు, సిబ్బంది



డెంకాడ: డెంకాడలో ప్రతిజ్ఞ చేస్తున్న ప్రజాప్రతినిధులు,అధికారులు



నెల్లిమర్ల: నెల్లిమర్లలో నిర్వహించిన ర్యాలీలో నగరపంచాయతీ కమిషనర్ అప్పలరాజు, ఏపీ మార్క్ ఫెడ్ చైర్మన్ బంగార్రాజు,తదితరులు



విజయనగరం రూరల్: దుప్పాడలో గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేస్తున్న డీపీఓ వెంకటేశ్వరరావు, తదితరులు



భోగాపురం: భోగాపురంలో ర్యాలీ చేస్తున్న అధికారులు, నాయకులు



పూసపాటిరేగ :ప్లాస్టిక్ వ్యర్థాలతో తయారు చేసిన గృహాలంకరణ వస్తువులను ప్రదర్శిస్తున్న ఎంపీడీఓ రాధిక, తదితరులు



విజయనగరం అర్బన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఐటీఐ ప్రాంగణంలో విద్యార్థుల మానవహారం

నాలెడ్జ్ క్వెస్ట్ పోటీలకు స్పందన



విజయనగరంలోని పి.ఎస్.ఆర్ స్కూల్‌లో శనివారం నిర్వహించిన 'నాలెడ్జ్ క్వెస్ట్ 2025 పోటీ'లకు విశేష స్పందన లభించింది. పాఠశాల కరస్పాండెంట్ పాలకపాటి సన్యాసిరాజు ఈ పోటీలను ప్రారంభించారు. పట్టణంలోని వివిధ పాఠశాలల నుంచి 500 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొని తమ ప్రతిభ కనబరిచారు. పోటీల్లో సీనియర్, జూనియర్ విభాగాల్లో విజేతలుగా నిలిచిన వారికి నగదు బహుమతులు ప్రకటించారు. త్వరలో డీఈఓ యు. మాణిక్యం నాయుడు చేతుల మీదుగా విజేతలకు నగదు బహుమతులను అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు.

– విజయనగరం అర్బన్

వాట్సప్ గవర్నెన్స్‌పై అవగాహన కల్పించండి



సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న జిల్లా ప్రత్యేక అధికారి, వాణిజ్య పన్నులు, సహకార శాఖ కమిషనర్ అహ్మద్ బాబు

- జిల్లా ప్రత్యేక అధికారి అహ్మద్ బాబు

విజయనగరం: వాట్సప్ గవర్నెన్స్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా ప్రత్యేక అధికారి, వాణిజ్య పన్నులు, సహకార శాఖ కమిషనర్ అహ్మద్ బాబు సచివాలయ సిబ్బందికి సూచించారు. జిల్లా కేంద్రంలో ప్రదీప్‌నగర్‌లో ఉన్న 41వ నెంబరు వార్డు సచివాలయంలో శనివారం తనిఖీలు నిర్వహించారు. రోజూ సచివాలయానికి ఎన్ని దరఖాస్తులు వస్తా యని సిబ్బందిని ఆరా తీశారు.

ప్రభుత్వ సేవల కోసం ఇకపై ప్రజలు సచివాలయానికి రానవసరం లేకుండా వాట్సప్ గవర్నెన్స్ ద్వారానే అందించాలని సిబ్బందిని ఆదేశించారు. ప్రభుత్వాన్ని ప్రజలకు చేరువ చేయడమే లక్ష్యంగా సిబ్బంది పనిచేయాలన్నారు. ఒక కుటుంబానికి సంబంధించి అన్ని రకాల సర్వేలను ఒకేసారి పూర్తి చేసేలా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు. వార్డు పరిధిలో ఆస్తి పన్ను వసూళ్లపై ఆరా తీశారు. పన్నుల వసూళ్లలో ముందున్న సిబ్బందికి ప్రోత్సాహకాలు ఇవ్వాలని మున్సిపల్ కమిషనర్ పి.నల్లనయ్యను ఆదేశించారు.

కార్పొరేషన్‌లో ఉన్న వార్డు సచివాలయ సిబ్బంది సేవలను జీవనోపాధులు కల్పించే కార్యక్రమాలకు వినియోగించాలని చెప్పారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను వినియోగించుకుని పట్టణాల్లోనూ మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించేలా ప్రాజెక్టులు రూపొందించాలని కలెక్టర్ డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్‌కు సూచించారు. ఆయన వెంట ఆర్డీఓ కీర్తి, డీసీసీబీ సీఈఓ ఉమామహేశ్వరరావు, తదితరులు ఉన్నారు.

వినియోగదారుల రక్షణ చట్టాన్ని నీరుగార్చొద్దు

విజయనగరం గంటస్తంభం: దేశంలో అన్నివర్గాల ప్రజలకు పూర్తిస్థాయిలో అండగా నిలిచే వినియోగదారుల హక్కుల రక్షణ చట్టాన్ని నీరుగార్చొద్దని, చట్టం పటిష్టంగా అమలయ్యేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని జిల్లా పౌరవేదిక అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ కోరారు. ప్రపంచ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా జిల్లా పౌర వేదిక కార్యాలయంలో వినియోగదారుల రక్షణ చట్టం, దాని ఉపయోగాలకు సంబంధించిన కరపత్రాలను శనివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా భీశెట్టి మాట్లాడుతూ మార్కెట్‌లో అంతులేని మోసాలు జరుగుతున్నాయన్నారు. వీటిని అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం 1985లో వినియోగదారుల రక్షణ చట్టాన్ని తీసుకువచ్చిందని, జిల్లా, రాష్ట్ర, కేంద్రం స్థాయిలో వినియోగదారుల ఫోరమ్‌లను ఏర్పాటు చేసిందని చెప్పారు. ఈ చట్టంలో 2019లో మార్పులు చోటు చేసుకున్నాయని వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ చట్టంపై విస్తృతంగా ప్రచారం చేయకుండా విలువైన చట్టానికి తూట్లు పొడుస్తున్నాయని భీశెట్టి ఆరోపించారు. వినియోగదారుల పరిరక్షణకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి ప్రజలను చైతన్యవంతులను చేయాలని కోరారు. సమావేశంలో పౌర వేదిక ప్రతినిధులు జలంత్రి రామచంద్రరాజు, ప్రభాకరరావు, రామ్‌మోహన్‌రావు, గోపి తదితరులు పాల్గొన్నారు.

పదోతరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

నెల్లిమర్ల: ఈనెల 17వ తేదీన పదోతరగతి పబ్లిక్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. పరీక్షల నిర్వహణకు మండలంలో, నెల్లిమర్ల నగర పంచాయతీ పరిధిలో ఏడు కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి చేశామని ఎంఈఓలు సూర్యనారాయణమూర్తి, ఈపు విజయకుమార్ శనివారం తెలిపారు. నగర పంచాయతీలో నెల్లిమర్ల బాలికలు,బాలుర ఉన్నత పాఠశాలల్లో, మండలం లోని సతివాడ మోడల్ స్కూల్, రామతీర్థం, అలుగోలు, మొయిద, పారసాం ఉన్నత పాఠశాలలను కేంద్రాలుగా ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. ఈకేంద్రాల్లో మొత్తం 1,343 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని చెప్పారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం



నృత్యం చేస్తున్న విద్యార్థులు

నెల్లిమర్ల: విద్యార్థులకు చదువుతో పాటు నైతిక విలువలు నేర్పించాలని ఎంఈఓలు సూర్యనారాయణమూర్తి, విజయ్‌కుమార్ సూచించారు. పట్టణంలోని సరస్వతీ శిశుమందిర్ పాఠశాల వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. అతిథులుగా హాజరైన ఎంఈఓలు మాట్లాడుతూ భారతీయ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణే ధ్యేయంగా సరస్వతీ శిశుమందిర్ పాఠశాలలను నిర్వహించడం అభినందించదగ్గ విషయమని కొనియాడారు. ఈ సందర్భంగా విద్యార్థుల కోలాటం, నత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. పాఠశాల ప్రధానాచార్యులు శ్రీనివాసరావు, ఇన్నర్ వీల్ క్లబ్ పూర్వ అధ్యక్షుడు ఉమా బాలాజీ, భీమిలి డైట్ కళాశాల అధ్యాపకుడు సారిపల్లి త్రినాథరావు, శిశుమందిర్ సమితి ప్రతినిధులు ప్రసాద్, సీతారాములు, సత్యం , రోటరీ క్లబ్ కార్యదర్శి శంకర్ రెడ్డి, అమ్మ సొసైటీ సభ్యులు పురుషోత్తం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.